జెన్‌సెట్ సరికొత్త మాడల్ జనరేటర్‌ను రాష్ట్ర మార్కెట్లోకి విడుదల చేస్తున్న మహీంద్రా పవరాల్ సంస్థ ప్రతినిధులు

హైదరాబాద్‌లోనే జనరేటర్ల ఉత్పత్తి

మహీంద్రా పవరాల్ ఎండీ వేణు వినోద్

హైదరాబాద్, మార్చి 14: జనరేటర్ల సంస్థ మహీంద్రా పవరాల్ జెన్‌సెట్ సరికొత్త మాడల్‌ను రాష్ట్ర మార్కెట్లోకి విడుదల చేసింది. రెకాన్ టెక్నాలజీతో రూపొందించిన ఈ జనరేటర్ 625 కిలోవాట్లతో సరికొత్త సీపీసీబీ ఐవీ+ ఉద్గార మార్గదర్శకాలకు లోబడి తయారుచేసింది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ వేణు వినోద్ మాట్లాడుతూ..తెలుగు రాష్ట్రాల్లో జనరేటర్లకు డిమాండ్ ఉంటుందన్న అంచనాతో ఈ నూతన శ్రేణిని విడుదల చేసినట్లు, దీంతో 625 కిలోవాట్ల వరకు జనరేటర్లను విడుదల చేసినట్లు అయిందన్నారు. పాతవాటితో పోలిస్తే ఈ జనరేటర్ పనితీరు మెరుగ్గా వుంటుందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్లాంట్లో జనరేటర్ల ఉత్పత్తి ప్రారంభించినట్లు, ఈ నూతన సిరీస్ డీజిల్ జనరేటర్లు కూడా ఇక్కడే తయారు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. మొత్తం వ్యాపారంలో తెలుగు రాష్ట్రాల వాటా అధికంగా ఉండటం వల్లనే ఇక్కడ యూనిట్‌ను నెలకొల్పినట్లు చెప్పారు.

డబ్ల్యూఎన్ఎస్ డెలివరీ సెంటర్

హైదరాబాద్‌లో 40వేల చదరపు అడుగుల్లో ప్రారంభించిన సంస్థ

న్యూఢిల్లీ, మార్చి 14: గ్లోబల్ బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం) కంపెనీ డబ్ల్యూఎన్ఎస్.. గురువారం హైదరాబాద్‌లో ఓ కొత్త డెలివరీ సెంటర్‌ను తెరిచింది. నానక్‌రామ్‌గూడలోని ప్రెస్టీజ్ స్కై టెక్ వద్ద 40వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో దీన్ని ప్రారంభించింది. దాదాపు 1,400 మంది ఉద్యోగులు ఇక్కడ పనిచేస్తారు. డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ డెలివరీ నెట్‌వర్క్‌లో భాగంగా ఏర్పాటైన ఈ ఫెసిలిటీ.. దాదాపు అన్ని రంగాలకు సేవలను అందించనున్నది. షిప్పింగ్, లాజిస్టిక్స్, హెల్త్ కేర్, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా, హైటెక్, ప్రొఫెషనల్ సర్వీసెస్ తదితర రంగాలకు చెందిన సంస్థలకు డిజిటల్ సొల్యూషన్స్‌ను ఇవ్వనున్నది. 'నైపుణ్యం, ప్రతిభ కలిగిన యువశక్తి, ప్రభుత్వ మద్దతులతో హైదరాబాద్ విశిష్ట సామర్థ్యాలను సంతరించుకున్నది. ఐటీ-బీపీఎం రంగంలో ఇక్కడ గొప్ప అవకాశాలున్నాయి' అని డబ్ల్యూఎన్ఎస్ గ్రూప్ సీఈవో కేశవ్ ఆర్ మురుగేశ్ ఈ సందర్భంగా అన్నారు. కాగా, ఇప్పటికే ఈ సంస్థకు బెంగళూరు, చెన్నై, గురుగ్రామ్, ఇండోర్, ముంబై, నాసిక్, నోయిడా, పుణె, విశాఖపట్టణాల్లో డెలివరీ సెంటర్లున్నాయి. గ్లోబల్ మార్కెట్ విషయానికొస్తే.. ప్రపంచవ్యాప్తంగా ఈ కంపెనీకి 66 డెలివరీ సెంటర్లున్నాయి. వీటిలో 60,652 మంది పనిచేస్తున్నారు. భారత్‌సహా కెనడా, చైనా, కోస్టారికా, మలేషియా, ఫిలిప్పీన్స్, పోలాండ్, రొమేనియా, దక్షిణాఫ్రికా, శ్రీలంక, టర్కీ, బ్రిటన్, అమెరికా దేశాల్లో డబ్ల్యూఎన్ఎస్‌కు డెలివరీ సెంటర్లున్నాయి. భారత్‌లో ముంబై ప్రధాన కేంద్రంగా ఈ సంస్థ పనిచేస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో సంస్థ లాభం గతంతో పోల్చితే 14 శాతం పెరిగింది. 39.6 మిలియన్ డాలర్లుగా నమోదైంది. రెవిన్యూ 326.2 మిలియన్ డాలర్లుగా ఉన్నది.

వెండి వెలుగులు

న్యూఢిల్లీ, మార్చి 14: బంగారం ధరలు మరింత పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో దేశీయంగా ధరలు పెరుగుతున్నాయి. దీంట్లో భాగంగా ఢిల్లీలో తులం బంగారం ధర మరో రూ.250 అధికమై రూ.66 వేల పైకి చేరుకొని రూ.66,200 వద్ద ముగిసింది. పసిడితోపాటు వెండి ఏకంగా రూ.1,700 అధికమై రూ.77 వేలు పలికింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 9 డాలర్లు పెరిగి 2,169 డాలర్లు పలుకగా, వెండి 24.22 డాలర్ల నుంచి 24.92 డాలర్లకు ఎగబాకింది.

సిట్రాయిన్ విస్తరణ

న్యూఢిల్లీ, మార్చి 14: ఫ్రెంచ్ వాహనాల ఉత్పత్తి సంస్థ సిట్రాయిన్..భారత్‌లో తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 58 అవుట్‌లెట్లు ఉండగా, ఈ ఏడాది చివరి నాటికి ఈ సంఖ్యను 200కి పెంచుకోవాలని చూస్తున్నది. దేశవ్యాప్తంగా కంపెనీ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో షోరూంల సంఖ్య ను మూడింతలు పెంచుతున్నట్లు సిట్రాయిన్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ శిశిర్ మిశ్రా తెలిపారు. ఇప్పటికే మెట్రో నగరాల్లో షోరూంలను ఏర్పాటు చేసినట్లు, ఇక నుంచి గ్రామీణ, చిన్న స్థాయి నగరాలపై దృష్టి సారించనున్నట్లు చెప్పా రు.

తగ్గిన టోకు ధరల సూచీ

న్యూఢిల్లీ, మార్చి 14: టోకు ధరల సూచీ మరింత తగ్గింది. జనవరి నెలకు గాను టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణం 0.2 శాతానికి తగ్గినట్టు పేర్కొంది. అంతకుముందు నెలలో 0.27 శాతం గా నమోదైనట్టు వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గత నెలలో ఆహార ద్రవ్యోల్బణ సూచీ 6.85 శాతం నుంచి 6.95 శాతానికి చేరుకోగా, కూరగాయల సూచీ 19.71 శాతం నుంచి 19.78 శాతానికి ఎగబాకింది.

గెలాక్సీ ఏ55, ఏ35 ధరలివే..

- వెల్లడించిన సామ్‌సంగ్

న్యూఢిల్లీ, మార్చి 14: గెలాక్సీ ఏ సిరీస్‌లో వస్తున్న రెండు సరికొత్త స్మార్ట్‌ఫోన్ల ధరలను గురువారం సామ్‌సంగ్ వెల్లడించింది. 5జీ శ్రేణిలో ఏ55, ఏ35 మాడళ్లను కంపెనీ తెస్తున్న విషయం తెలిసిందే. గెలాక్సీ ఏ35 5జీలో రెండు వేరియంట్లుండగా, ఏ55 5జీలో మూడు వేరియంట్లున్నాయి. కాగా, ఏ35 స్మార్ట్‌ఫోన్ కనిష్ఠ ధర రూ.30,999గా, గరిష్ఠ ధర రూ.33,999గా ఉన్నది. ఇక ఏ55 స్మార్ట్‌ఫోన్ ధరలు రూ.39,999, రూ.42,999, రూ.45,999గా ఉన్నాయి. ఏ35 మొబైల్స్ 8జీబీ ర్యామ్, 128, 256జీబీల స్టోరేజీ సామర్థ్యంతో ఉంటాయి. ఇక ఏ55 మొబైల్స్ 8జీబీ, 12జీబీల ర్యామ్‌తో 128, 256జీబీల స్టోరేజీ సామర్థ్యంతో ఉన్నాయి. డ్యూయల్ సిమ్ ఆప్షన్, 6.6 అంగుళాల సూపర్ ఎమో ఎల్ఈడీ డిస్‌ప్లేలతో పరిచయమైన ఈ మొబైల్స్‌లో.. ఏ35 మొబైల్‌లో 50, 8, 5 మెగాపిక్సల్‌తో బ్యాక్ కెమెరాలు.. 13 మెగాపిక్సల్‌తో ఫ్రంట్ కెమెరా ఉన్నాయి. ఏ55 మొబైల్‌లో 50, 12, 5 మెగాపిక్సల్‌తో బ్యాక్ కెమెరాలు.. 32 మెగాపిక్సల్‌తో ఫ్రంట్ కెమెరా ఉన్నాయి. కాగా, సామ్‌సంగ్ ఎక్స్‌క్లూజివ్, భాగస్వామ్య స్టోర్లలో సామ్‌సంగ్.కామ్‌పై లైవ్ కామర్స్ ద్వారా సేల్స్ మొదలయ్యాయి. అయితే ఇతర ఆన్‌లైన్ వేదికలపై మాత్రం ఈ నెల 18 నుంచి అమ్మకాలు ఆరంభమవుతాయి. ఏ55 మొబైల్‌ను రూ.1,792, ఏ35 మొబైల్‌ను రూ.1,723 నెలవారీ ఈఎంఐతో కొనుగోలు చేసేలా బజాజ్ ఫైనాన్స్, ఇతర ఎన్‌బీఎఫ్‌సీలతో జట్టు కట్టినట్టు సామ్‌సంగ్ ఇండియా వీపీ (ఎంఎక్స్ బిజినెస్) ఆదిత్య బబ్బర్ తెలిపారు. సామ్‌సంగ్ ఫైనాన్స్ ప్లస్‌పైనా ఈ అవకాశం ఉంటుందన్నారు. ఇక హెచ్‌డీఎఫ్‌సీ, వన్‌కార్డ్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ కార్డులపై రూ.3,000 వరకు క్యాష్‌బ్యాక్ సౌకర్యం కూడా ఉన్నది. 6 నెలల నోకాస్ట్ ఈఎంఐ వెసులుబాట్లూ ఉన్నట్టు చెప్పారు. ఈ మొబైల్స్ ఆసమ్ ఐస్‌బ్లూ, లైలాక్, నావీ కలర్లలో లభిస్తున్నాయి.

పీఎస్‌బీల్లో వాటా తగ్గిస్తాం

కేంద్ర ఆర్థిక సర్వీసుల కార్యదర్శి

ముంబై, మార్చి 14: కనీస పబ్లిక్ వాటాపై సెబి నిబంధనలకు అనుగుణంగా ఐదు పీఎస్‌యూ బ్యాంక్‌ల్లో కేంద్ర ప్రభుత్వ వాటా తగ్గిస్తామని కేంద్ర ఆర్థిక సర్వీసుల కార్యదర్శి వివేక్ జోషి వెల్లడించారు. సెబీ కనీస పబ్లిక్ వాటా (ఎంపీఎస్) నిబంధనల ప్రకారం లిస్టెడ్ కంపెనీల్లో పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటాను ఆఫ్‌లోడ్ చేయాలి. 2023 మార్చి 31నాటికి మొత్తం 12 పీఎస్‌యూ బ్యాంక్‌ల్లో నాలుగింటిలో మాత్రమే ఎంపీఎస్ నిబంధనల ప్రకారం పబ్లిక్ వాటా ఉన్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో మూడు పీఎస్‌యూ బ్యాంక్‌ల్లో పబ్లిక్ వాటా నిర్దేశిత పరిమితికి చేరిందని, మిగిలిన ఐదు బ్యాంక్‌ల్లో ప్రభుత్వ వాటాను తగ్గించడానికి కార్యచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్టు జోషి వివరించారు. ప్రస్తుతం కేంద్రానికి పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లో 98.25 శాతం, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో 96.38 శాతం, యూకో బ్యాంక్‌లో 95.39 శాతం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 93.08 శాతం, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు 86.46 శాతం చొప్పున వాటా ఉన్నది.

కోలుకున్న స్టాక్ మార్కెట్లు

సెన్సెక్స్ 335, నిఫ్టీ 149 పాయింట్లు వృద్ధి

ముంబై, మార్చి 14: దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి లాభాలను సంతరించుకున్నాయి. గురువారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 335.39 పాయింట్లు లేదా 0.46 శాతం పుంజుకొని 73,097.28 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 602.41 పాయింట్లు పెరిగినా.. మదుపరుల లాభాల స్వీకరణతో తగ్గుముఖం పట్టింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 148.95 పాయింట్లు లేదా 0.68 శాతం ఎగిసి 22,100 మార్కును అధిగమిస్తూ 22,146.65 వద్ద నిలిచింది. బుధవారం తీవ్ర అమ్మకాల ఒత్తిడి నడుమ సెన్సెక్స్ 906, నిఫ్టీ 338 పాయింట్లు పతనమైన విషయం తెలిసిందే. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) రూ.4,595.06 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. కాగా, ఐటీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం కలిసొచ్చిందని ట్రేడింగ్ నిపుణులు మార్కెట్ సరళిని విశ్లేషిస్తున్నారు. దేశ జీడీపీ అంచనాను వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను ఫిచ్ రేటింగ్స్ 7 శాతానికి పెంచడం, ఫిబ్రవరిలో టోకు ద్రవ్యోల్బణం 0.2 శాతానికి దిగిరావడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చిందని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే రిటైల్ ద్రవ్యోల్బణం కూడా తగ్గుముఖం పడితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్ల కోతలకు దిగవచ్చన్న అంచనాలను వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికే ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలపై ఆశాజనకంగా స్పందిస్తున్నదని, అదే జరిగితే ఇక్కడా వడ్డీరేట్లు దిగొస్తాయని చెప్తున్నారు. దీంతో మార్కెట్లకు మరింత ఉత్సాహం లభిస్తుందని, ఆయా వడ్డీరేట్ల ఆధారిత కంపెనీల షేర్లు పరుగులు పెడుతాయని అంటున్నారు.

గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్ సూచీలు లాభాల్లో ముగిశాయి. చైనా, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లలోనూ జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ సూచీలు లాభాల్లోనే కదలాడుతున్నాయి. ఇక బుధవారం అమెరికా మార్కెట్లు మిశ్రమంగా ముగిసిన విషయం తెలిసిందే.

మార్కెట్ విలువ అప్

స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగియడంతో మదుపరుల సంపద కూడా మళ్లీ ఎగబాకింది. బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.7,81,631.24 కోట్లు పెరిగి రూ.3,79,98,233.91 కోట్ల (4.59 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది. సెన్సెక్స్ షేర్లలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు భారీగా లాభపడ్డాయి.

ఆట

సింధు ఔట్

ఆల్ ఇంగ్లండ్ టోర్నీ

బర్మింగ్‌హామ్: ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు పోరాటం ముగిసింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో సింధు 19-21, 11-21తో అన్ సె యంగ్(కొరియా) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇటీవలే గాయం నుంచి తిరిగి కోర్టులోకి అడుగుపెట్టిన సింధు..ప్రపంచ నంబర్‌వన్ యంగ్‌కు దీటైన పోటీనివ్వలేకపోయింది. 42 నిమిషాల్లోనే ముగిసిన పోరులో యంగ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. కొరియా షట్లర్‌తో ముఖాముఖి పోరులో సింధు ఏడోసారి ఓటమిపాలైంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 24-22, 11-21, 21-14తో అండ్రెస్ అంటోనెస్‌పై గెలిచి ముందంజ వేశాడు. మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో, అశ్విని పొనప్ప జోడీ 21-11, 11-21, 11-21తో జాంగ్ షు, జాంగ్ యు ద్వయంపై గెలిచి క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది.

క్వార్టర్స్‌లో శరత్‌కమల్

సింగపూర్: సింగపూర్ స్మాష్ టీటీ టోర్నీలో భారత స్టార్ ప్యాడ్లర్ ఆచంట శరత్‌కమల్ క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో కమల్ 11-4, 11-8, 12-10తో ఒమర్ అస్సర్(ఈజిప్టు)పై అద్భుత విజయం సాధించాడు. తన(88ర్యాంక్) కంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న అస్సర్(22)ను ఓడించి కమల్ ముందంజ వేశాడు. తొలి రెండు గేమ్‌లను అలవోకగా కైవసం చేసుకున్న ఈ సీనియర్ ప్యాడ్లర్‌కు మూడో గేమ్‌లో ప్రత్యర్థి నుంచి దీటైన పోటీ ఎర్పడింది. క్వార్టర్స్‌లో ఫెలిక్స్ లెబ్రాన్(ఫ్రాన్స్)తో కమల్ తలపడుతాడు.

భారత్, ఐర్లాండ్ టికెట్లు 19న

దుబాయ్: ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో భారత్, ఐర్లాండ్ పోరుతో పాటు సెమీఫైనల్ మ్యాచ్‌ల టికెట్లు ఈ నెల 19న విడుదల కాబోతున్నాయి. ఈ విషయాన్ని ఐసీసీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. అమెరికా, వెస్టిండీస్ వేదికలుగా జరుగనున్న మెగా టోర్నీలో 13 అదనపు మ్యాచ్‌లకు సంబంధించిన టికెట్లు వచ్చే వారం అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే 37 మ్యాచ్‌ల టికెట్లను కొనుగోలుకు ఉంచారు. భారత్ తమ తొలి మ్యాచ్‌లో జూన్ 5న ఐర్లాండ్‌తో 9వ తేదీన చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడుతుంది. దాయాదుల పోరు టికెట్లకు భారీ డిమాండ్ ఏర్పడిందని ఐసీసీ పేర్కొంది.

ముంబై X బెంగళూరు

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఎలిమినేటర్ పోరుకు సిద్ధమయ్యాయి. శుక్రవారం ఇరు జట్లు ఫైనల్ బెర్తు కోసం తలపడనున్నాయి. లీగ్ దశలో రెండు, మూడు స్థానాల్లో నిలిచిన ముంబై, బెంగళూరు..ఢిల్లీతో టైటిల్ పోరులో నిలిచేందుకు తహతహలాడుతున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో ముంబై మరోమారు తుది పోరుకు అర్హత సాధించాలని చూస్తుంటే..తొలిసారి ఫైనల్ ఫైట్‌లో నిలిచేందుకు బెంగళూరు పట్టుదలతో ఉంది.

ఆ ఇద్దరు ఒక్కటయ్యారు!

ఆస్ట్రేలియా గే ఫుట్‌బాలర్ జోష్ కావల్లో.. లైటన్ మోర్రెల్ ఒక్కటయ్యారు. అడిలైడ్ యూనైటెడ్ స్టేడియంలో జోష్ మోకాలుపై కూర్చుని లైటన్‌కు ప్రపోజ్ చేశాడు. త్వరలోనే ఈ జోడీ నిశ్చితార్థంతో ఒక్కటి కాబోతున్నది.

ముంబై @ 42

రంజీ ట్రోఫీ టైటిల్ కైవసం
ఫైనల్లో విదర్భ పై ఘన విజయం
ధవల్ కులకర్ణికి వీడ్కోలు

ముంబై మళ్లీ మెరిసింది. దేశవాళీ క్రికెట్‌పై మరోమారు తనదైన ముద్రవేస్తూ ముంబై 42వ సారి రంజీ ట్రోఫీ టైటిల్‌ను సగర్వంగా ముద్దాడింది. గత 90 ఏండ్లలో 48వసారి ఫైనల్ చేరిన ముంబై రంజీ కింగ్‌గా అవతరించింది. ఆఖరి రోజు వరకు ఆసక్తికరంగా సాగిన తుది పోరులో విదర్భ తుదికంటా పోరాడినా..ముంబై అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. సరిగ్గా ఎనిమిదేండ్ల తర్వాత రంజీ ట్రోఫీని తమ ఖాతాలో వేసుకుంది. టైటిల్ గెలిచి ధవల్ కులకర్ణికి ఘనంగా వీడ్కోలు పలికింది. దీటుగా పోరాడిన విదర్భ రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

ముంబై: దేశవాళీ క్రికెట్‌లో అత్యున్నత ట్రోఫీగా పేరు గాంచిన రంజీ ట్రోఫీలో ముంబై విజేతగా నిలిచింది. ఐదు రోజుల పాటు నువ్వానేనా అన్నట్లు సాగిన పోరులో ముంబై 169 పరుగుల తేడాతో విదర్భపై చిరస్మరణీయ విజయం సాధించింది. 538 పరుగుల భారీ లక్ష్యఛేదన కోసం ఓవర్‌నైట్ స్కోరు 248/5 ఐదో రోజు ఆట కొనసాగించిన విదర్భ 368 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ అక్షయ్ వాడ్కర్(199 బంతుల్లో 102, 9ఫోర్లు, సిక్స్), హర్ష్ దూబే(128 బంతుల్లో 65, 5ఫోర్లు, 2సిక్స్‌లు) పోరాటం చేసినా విదర్భ విజయతీరాలకు చేరలేకపోయింది. తనుశ్ కొటియాన్(4/95) నాలుగు వికెట్లతో విజృంభించగా, తుషార్, ముషీర్‌ఖాన్ రెండేసి వికెట్లు తీశారు. తన కెరీర్‌లో చివరి రంజీ మ్యాచ్ ఆడిన ధవల్ కులకర్ణి(1/38) ఒక వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. ముషీర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', తనుశ్ కొటియాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' దక్కాయి.

వాడ్కర్, దూబే పోరాడినా: ముంబైకి విదర్భ దీటుగా సమాధానమిచ్చే ప్రయత్నం చేసింది. వాడ్కర్ ముంబై బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టాడు. ఈ క్రమంలో తొలి సెషన్‌లో వికెట్ కోల్పోని విదర్భ.. వాడ్కర్ నిష్క్రమణతో వెంటవెంటనే వికెట్లు చేజార్చుకుంది. ఉమేశ్‌యాదవ్(6)ను క్లీన్‌బౌల్డ్ చేయడం ద్వారా కులకర్ణి..విదర్భ ఇన్నింగ్స్‌కు ముగింపు పలికాడు.

5 కోట్ల ప్రైజ్‌మనీ

రికార్డు స్థాయిలో 42వ సారి రంజీ టైటిల్ గెలిచిన తమ జట్టుకు ముంబై క్రికెట్ అసోసియేషన్ 5 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది. సాధారణం కంటే ఇది రెట్టింపు అని అసోసియేషన్ అధ్యక్షుడు అమోల్ కాలె పేర్కొన్నాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.